



APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24






సంపుటి :9 సంచిక : 290 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 26-04-2023 బుధవారం పేజీలు :4 వెల : రూ.3/-










# దేశంలో తొలి వాటర్ మెట్రో ప్రారంభించిన మోదీ

**తిరువనంతపురం:** దేశంలో కేరళలో తొలిసారి కొత్త మెట్రో వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. కోచి వాటర్ మెట్రో పేరుతో నీటిపై నడిచే మెట్రో సర్వీస్‌ను ప్రధాని మోదీ మంగళవారం జాతికి అంకితం చేశారు. అంతకుముందు ఆయన ఆ రాష్ట్రంలో మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు జెండా ఊపారు. ఇది తిరువనంతపురం నుంచి కాసరగోడ్ వరకు రాకపోకలు సాగిస్తుంది. అంతేగాకుండా డిజిటల్ సైన్స్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభాల్లో భాగంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

'ఈ రోజు కేరళకు మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. అలాగే కోచిలో వాటర్ మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. కేరళ విద్యావంతుల రాష్ట్రం. ఇక్కడి ప్రజల కృషి, వినయం వారి గుర్తింపులో భాగం. దేశ రైల్వే నెట్‌వర్క్ వేగంగా మార్పు చెందుతోంది. అధిక వేగం కలిగిన రైళ్ల రాకపోకలకు సిద్ధం అవుతోంది. రాష్ట్రాల అభివృద్ధే దేశ ప్రగతికి మూలమని మా ప్రభుత్వం నమ్ముతోంది' అని ప్రధాని తెలిపారు. రెండురోజుల కేరళ పర్యటనలో భాగంగా ఆయన సంప్రదాయ వస్త్రధారణలో కనిపించారు. ఈ సందర్భంగా మలయాళ నటుడు ఉన్ని ముకుందన్.. ప్రధానిని కలిశారు. కల నెరవేరిందంటూ సంతోషం వ్యక్తం చేశారు.

**వాటర్ మెట్రో ప్రత్యేకతలివే..!**

– దేశంలో, దక్షిణాసియాలోనే తొలి వాటర్ మెట్రో ఇదేనని, కేరళ రాష్ట్రం కలల ప్రాజెక్ట్ అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. కోచి మెట్రో రైల్ లిమిటెడ్ దీని నిర్వహణ బాధ్యతలను చూసుకుంటుంది. కోచి వాటర్ మెట్రో సర్వీస్‌లో బ్యాటరీ సాయంతో నడిచే 78 ఎలక్ట్రిక్ హైబ్రిడ్ బోట్లు ఉంటాయి. వీటి కోసం 38 టెర్మినళ్లు నిర్మించారు. కోచి చుట్టుపక్కల ఉండే 10 ద్వీపాలను కలుపుతూ ఈ వాటర్ మెట్రో రాకపోకలు సాగిస్తుంది.



వాటర్ మెట్రో ప్రాజెక్ట్‌ను ? 1,136.83 కోట్ల వ్యయంతో నిర్మించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం, జర్మనీకి చెందిన ఫండింగ్ సంస్థ కేఎఫ్‌డబ్ల్యూ కలిసి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టాయి. ఇది పూర్తిగా విద్యుత్ సాయంతో పనిచేస్తుండటంతో పర్యావరణానికి ఎలాంటి హాని ఉందదు. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వాటర్ మెట్రో సర్వీస్‌తో కోచి పరిసర ప్రాంతాల్లో పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని కేరళ ప్రభుత్వం భావిస్తోంది. దశల వారీగా ఈ సర్వీసుల సంఖ్య పెంచనున్నట్లు సీఎం విజయన్ తెలిపారు. ప్రస్తుతం రోజుకు 12 గంటల పాటు ఈ మెట్రో సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.

ఇందులో ఏసీ, వైఫై సౌకర్యం అందిస్తున్నారు. ఒక్కో బోటులో 50 నుంచి 100 మంది ప్రయాణించవచ్చు. ఇవి కనిష్ఠంగా గంటకు 15 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 22 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. అత్యాధునిక భద్రత, సమాచార వ్యవస్థ వీటిలో ఉన్నాయి.

కోచి వాటర్ మెట్రో సర్వీస్‌లో టికెట్ ప్రారంభ ధర ? 20 కాగా, గరిష్ఠ టికెట్ ఖరీదు ? 40. టికెట్లతోపాటు పాస్‌ల సౌకర్యాన్ని కూడా కేరళ ప్రభుత్వం తీసుకొచ్చింది. వారం రోజుల పాస్ ఖరీదు ? 180, నెల వారీ పాస్ ధర ? 600, మూడు నెలల పాస్ ఖరీదు ? 1500గా నిర్ణయించారు.

# నేడు ఏపీ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ఫలితాలు బుధవారం విడుదల చేయనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో సాయంత్రం 5గంటలకు ఇంటర్ ఫలితాలను విడుదల చేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలో ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ కలిపి మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 9,20,552 మంది, ఒకేషనల్ విద్యార్థులు 83,749 మంది



పరీక్షలకు హాజరయ్యారు. ఏపీ ఇంటర్ ఫలితాలను bie.ap.gov.in వెబ్‌సైట్‌తో పాటు eenadu.net, eenadu pratibha.netలలో తెలుసుకోవచ్చు.

# ఆన్‌లైన్‌లో శ్రీశైలం మల్లన్న ఆర్జిత సేవల టికెట్లు

**శ్రీశైలం:** శ్రీశైలం దేవస్థానంలో పూర్తిస్థాయి ఆన్‌లైన్ ద్వారా ఆర్జిత సేవల టికెట్ల జారీ విధానాన్ని మంగళవారం దేవస్థానం ఈవో ఎస్.లవన్న ప్రారంభించారు. మే ఒకటో తేదీ నుంచి పూర్తి స్థాయిలో



ఆన్‌లైన్‌లోనే ఆర్జిత సేవల టికెట్లు లభిస్తాయని ఈవో తెలిపారు. ముందస్తు లేఖలు ఇచ్చిన వారికి ప్రొటోకాల్ దర్శనం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. www.srisailadevasthanam.org, www.aptemples.ap.gov.in ద్వారా ఇవాళ్టి నుంచి టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

# పరువు నష్టం కేసు.. గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్

**అహ్మదాబాద్:** పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. తనకు విధించిన శిక్షను నిలిపేయాలంటూ వేసిన స్టే పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు తిరస్కరించిన నేపథ్యంలో.. న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ ఆయన తాజాగా గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'మోదీ' ఇంటిపేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో సూరత్ కోర్టు.. రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ గతంలో తీర్పు చెప్పిన విషయం తెలిసిందే.




'దొంగలందరికీ మోదీ అనే ఇంటిపేరే ఎందుకు ఉంటుందో?' అంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ వ్యాఖ్యానించారంటూ గుజరాత్ భాజపా ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ న్యాయస్థానంలో పరువునష్టం దావా వేయడంతో ఈ కేసు వ్యవహారం మొదలైంది. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే దీన్ని పై కోర్టులో సవాల్ చేసేందుకు వీలుగా 30 రోజుల గడువు ఇచ్చింది. అప్పటి వరకు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత రాహుల్‌పై ఎంపీగా అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం, పార్లమెంటు సభ్యులు ఏదైనా కేసులో దోషిగా తేలి.. కనీసం రెండేళ్ల శిక్ష పడితే అనర్హతకు గురవుతారని గుర్తు చేసింది.

అనంతరం రాహుల్ గాంధీ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేయాలని.. అలాగే తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలంటూ రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఏప్రిల్ 3న విచారణ చేపట్టిన కోర్టు.. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణలో భాగంగా ఏప్రిల్ 13న ఇరు పక్షాల వాదనలు విని 20న తీర్పు వెలువరించింది. తాజాగా దీనిని సవాల్ చేస్తూ రాహుల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు.

# ప్రధాని మోదీ అభివృద్ధి విధానాలతో ఏకీభవిస్తున్నాం: చంద్రబాబు

**అమరావతి:** ఎన్డీఏ అభివృద్ధి విధానాలపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రత్యేక హోదా సెంటిమెంట్ వల్లే ఎన్డీఏ నుంచి బయటికొచ్చామని స్పష్టం చేశారు. 'టైమ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్: ద నీడ్ టు కీప్ ఫైటింగ్' అంశంపై జరిగిన సదస్సులో చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ప్రధాని మోదీ అభివృద్ధి విధానాలతో ఏకీభవిస్తున్నట్టు చెప్పారు.



"మోదీ ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు తెచ్చారు. మోదీ వల్లే ఇవాళ ప్రపంచమంతా భారత్‌ను గుర్తిస్తోంది. పీపీపీ– పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ అన్నది కొత్త విధానం. టెక్నాలజీతో పేదరికాన్ని రూపుమాపవచ్చు. ఫిన్‌టెక్ దేశంలో కొత్త విప్లవాన్ని తెచ్చింది. డిజిటల్ టెక్నాలజీ, డెమోగ్రాఫిక్ డివిడెండ్ దేశాన్ని నడిపిస్తాయి. మోదీ తెస్తున్న మార్పులు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ప్రధాని విధానాలను మెరుగుపెడితే 2050 నాటికి భారత్‌దే అగ్రస్థానం. రూ.500 కంటే పెద్ద నోట్లన్నీ రద్దు చేయాలని ప్రతిపాదిస్తున్నా" అని చంద్రబాబు తెలిపారు.




V న్యూస్

# మితి మీరితే... మరో ప్రమాదం!

పవిత్ర చార్‌ధామ్ యాత్ర ఎప్పటి లానే ఈ ఏడూ మొదలైంది. అక్షయ తృతీయ వేళ గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచుకున్నాయి. ఏప్రిల్ 25న కేదార్‌నాథ్, 27న బదరీనాథ్ తెరిచేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. మొదలవుతూనే ఈ యాత్ర అనేక ప్రశ్నలనూ మెదిలేలా చేసింది. హిమాలయ పర్వతాల్లో కఠోర వాతావరణ పరిస్థితుల మధ్య సాగే ఈ యాత్రలో కొండచరియలు విరిగిపడి బదరీనాథ్ హైవే తాజాగా మూసుకుపోవడం పొంచివున్న ప్రమాదాలకు ముందస్తు హెచ్చరిక.

యమునోత్రి ప్రయాణంలో తొలిరోజే ఇద్దరు గుండె ఆగి మరణించడం యాత్రికుల శారీరక దృఢత్వానికి సంబంధించి అధికారుల ముందస్తు తనిఖీ ప్రక్రియపై అనుమానాలు రేపుతోంది. ఇప్పటికే 16 లక్షల మందికి పైగా యాత్రకు పేర్లు నమోదు చేసుకున్న వేళ... రానున్న కొద్ది వారాల్లో ఈ పర్వత ప్రాంత గ్రామాలు, పట్నాల మీదుగా ప్రయాణంపై భయాందోళనలు రేగుతున్నాయి.

'దేవభూమి' ఉత్తరాఖండ్ అనేక హిందూ దేవాలయాలకు ఆలవాలం. చార్‌ధామ్‌గా ప్రసిద్ధమైన యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బదరీనాథ్‌లు ఇక్కడివే. ఇన్ని ఆలయాలు, ప్రకృతి అందాలకు నెలవైన ఉత్తరాఖండ్‌కు ఆర్థిక పురోభివృద్ధి మంత్రాల్లో ఒకటి %--% పర్యాటకం. అయితే, అదే సమయంలో హిమాలయాల ఒడిలోని ఈ ప్రాంతం పర్యావరణపరంగా అతి సున్నిత ప్రాంతం. ఈ సంగతి తెలిసినా, పర్యావరణ నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నా పాలకులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు.

ఉత్పాతాలనూ లెక్క చేయకుండా, చార్‌ధామ్ ప్రాంతాలను వ్యాపారమయం చేసి, భరించలేనంతగా యాత్రికుల్ని అనుమతిస్తున్నారు. హిమాలయాల్లో పద్ధతీ పాడూ లేక ఇష్టారాజ్యంగా చేపడుతున్న సోకాల్డ్ అభివృద్ధి ప్రాజెక్టులు, అనియంత్రిత పర్యాటకం కలగలసి మానవ తప్పిదంగా మారాయి. ఈ స్వయంకృతాపరాధాలతో వాతావరణ మార్పులకు మంచుదిబ్బలు విరిగిపడుతున్నాయి. జోషీ మఠ్ లాంటి చోట్ల జనవరిలో భూమి కుంగి, ఇళ్ళన్నీ బీటలు వారి మొదటికే మోసం రావడం తెలిసిందే!

నియంత్రణ లేని విపరీత స్థాయి పర్యాటకం ఎప్పుడైనా, ఎక్కడైనా మోయలేని భారం. విషాదమేమంటే, ప్రాకృతిక సంపదైన హిమాలయాలను మన పాలకులు, ప్రభుత్వాలు ప్రధాన ఆర్థిక వనరుగా చూస్తుండడం, వాటిని యథేచ్ఛగా కొల్లగొట్టడం! అభివృద్ధి, పర్యాటక అనుభవం పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉండడం! కనీసం ఆ ప్రాంతాలు ఏ మేరకు సందర్శకుల తాకిడిని తట్టుకోగలవనే మదింపు కూడా ఎన్నడూ మనవాళ్ళు చేయనేలేదు.

బదరీనాథ్, కేదార్‌నాథ్‌లు తట్టుకోగలవని పర్యావరణ నిపుణులు అంచనా వేసిన రద్దీ కన్నా రెండు, మూడింతలు ఎక్కువగా, దాదాపు 15 వేల మందికి పైగా జనాన్ని నిరుడు ప్రభుత్వం అనుమతించడం విచిత్రం. ఒక్క గడచిన 2022లోనే ఏకంగా కోటి మంది పర్యాటకులు ఉత్తరాఖండ్‌ను సందర్శించినట్టు లెక్క. కేవలం చార్‌ధామ్ యాత్రాకాలంలోనే రికార్డు స్థాయిలో 46 లక్షల మంది వచ్చారు. ఈ ఏడాది ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా. ఈ పరిస్థితుల్లో రోజుకు అనుమతించాల్సిన యాత్రికుల సంఖ్యపై పరిమితిని ఎత్తేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం ఏ రకంగా సమర్థనీయం!

నిజానికి 'జాతీయ విపత్తు నివారణ సంస్థ' (ఎన్డీఎంఏ) 2020 నాటి నివేదికలోనే భారత హిమా లయ ప్రాంతం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్ళను ఏకరవు పెట్టింది. పర్యాటకం, పట్టణ ప్రాంతాలకు వలసల వల్ల పట్నాల మొదలు గ్రామాల వరకు తమ శక్తికి మించి రద్దీని మోయాల్సిన పరిస్థితి వచ్చిందని కూడా చెప్పింది.

బఫర్ జోన్‌ను సృష్టించడం సహా అనేక నియంత్రణ చర్యలను సిఫార్సు చేసింది. మంచుదిబ్బలు విరిగిపడి, వరదలకు కారణమయ్యే ప్రాంతాల్లో పర్యాటకాన్ని నియంత్రించాలనీ, తద్వారా కాలుష్యస్థాయిని తగ్గించాలనీ సూచించింది. పాలకులు వాటిని వినకపోగా, ఏటేటా ఇంకా ఇంకా ఎక్కువ మందిని యాత్రకు అనుమతిస్తూ ఉండడం విడ్డూరం.

జోషీమఠ్‌లో విషాదం ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. బీటలు వారిన అనేక ఇళ్ళు కూల్చివేయక తప్పలేదు. గూడు చెదిరి, ఉపాధి పోయి వీధినపడ్డ వారికి ఇంకా పరిహారం అందనే లేదు. తాత్కాలిక శిబిరాల్లోనే తలదాచుకుంటున్న దుఃస్థితి. ఈ పరిస్థితుల్లో గత వారం కూడా కొత్తగా కొన్ని ఇళ్ళు బీటలు వారాయన్న వార్త ప్రకృతి ప్రకోపాన్ని చెబుతోంది. సిక్కు పర్యాటక కేంద్రం హేమ్‌కుండ్ సాహిబ్‌కూ, చార్‌ధామ్ యాత్రలో బదరీనాథ్‌కూ సింహద్వారం ఈ జోషీమఠే.

పరిస్థితి తెలిసీ ఈసారి పర్యాటకుల సంఖ్య రికార్డులన్నీ తిరగరాసేలా ఉంటుందని రాష్ట్ర సీఎం ప్రకటిస్తున్నారు. జోషీమఠ్, ఔలీ ప్రాంతాలు అన్ని రకాలుగా సురక్షిత ప్రాంతాలని ప్రచారం చేసేందుకు తపిస్తున్నారు. ప్రమాదభరితంగా మారిన ఆ కొండవాలు ప్రాంతాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసి, విపరీతంగా వాహనాలను అనుమతించడం చెలగాటమే. కనుక తొందరపాటు వదిలి, తగిన జాగ్రత్తలు చేపట్టాలి.

హిందువులకు జీవితకాల వాంఛల్లో ఒకటైన ఈ యాత్ర ప్రభుత్వానికీ, స్థానిక ఆర్థిక వ్యవస్థకూ బోలెడంత డబ్బు తెచ్చిపెట్టవచ్చు గాక. ధర్మవ్యాప్తిలో ముందున్నామని పాలక పార్టీలు జబ్బలు చరుచుకొనేందుకూ ఇది భలేఛాన్స్ కావచ్చు గాక. జలవిద్యుత్కేంద్రాలు సహా విధ్వంసకర అభివృద్ధితో ఇప్పటికే కుప్పకూలేలా ఉన్న పర్యావరణ వ్యవస్థపై అతిగా ఒత్తిడి తెస్తే మాత్రం ఉత్పాతాలు తప్పవు.

మొన్నటికి మొన్న 2013లో 5 వేల మరణాలకు కారణమైన కేదారనాథ్ వరదల్ని విస్మరిస్తే ఎలా? పర్యావరణం పట్ల మనం చేస్తున్న ఈ పాపం పెను శాపంగా మారక ముందే కళ్ళు తెరిస్తే మంచిది. హిమాలయ పర్వత సానువులు అనేకులకు అతి పవిత్రమైనవీ, అమూల్యమైనవీ గనక వాటిని పరిరక్షించడం మరింత ఎక్కువ అవసరం. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికా రచన తక్షణ కర్తవ్యం.

# ప్రధాన పార్టీలకు రెబల్స్ ట్రబుల్..

**బెంగళూరు:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగిసింది. దాదాపు 517 మంది పోటీ నుంచి తొలగిపోవడంతో 224 స్థానాలకు గాను ప్రస్తుతం 2613 మంది బరిలో నిలిచారు. మొదట్లో రెబల్ అభ్యర్థులూ నామినేషన్ వేయడంతో పలు పార్టీలు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అలాంటివారిని బుజ్జగిస్తూ.. నామినేషన్ ఉపసంహరించు కునేలా చేసేందుకు తీవ్రంగా శ్రమించాయి. తాము ఎంపిక చేసిన అభ్యర్థులను పోటీలో ఉంచేందుకు ప్రయత్నించిన ప్పటికీ.. పలు స్థానాల్లో మాత్రం మూడు ప్రధాన పార్టీలకు రెబల్స్ ట్రబుల్‌గా మారారు.

**భాజపాకు అధికంగా..**

ఈసారి ఎన్నికల్లో వ్యూహం మార్చిన భాజపా అనేక స్థానాల్లో అభ్యర్థులను మార్చింది. దీంతో భాజపానే రెబల్స్ నుంచి ఎక్కువ ముప్పు ఎదుర్కొంటోంది. పుత్తూర్, అఫ్జల్‌పుర్, బెయిల్‌హొంగళ్, చెన్నగిరితోపాటు గుండ్లపేట్, హొసదుర్గ, మలూర్, గాంధీనగర్ స్థానాల్లో సొంతపార్టీ నేతల తిరుగుబాటును ఎదుర్కొం టోంది. ముఖ్యంగా పుత్తూర్‌లో భాజపాకు విధేయుడిగా పేరొందిన అరుణ్ పుథిలా రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. పోటీ నుంచి తప్పించేందుకు పార్టీ నాయకత్వం అన్నివిధాలా ప్రయత్నించినప్పటికీ ఆయన మాత్రం బరిలో నుంచి బయటకు వచ్చేందుకు ససేమిరా అన్నారు.

బెళగావిలోని బెయిల్‌హొంగళ్ లోనూ రెబల్ నేతగా విశ్వనాథ్ పాటిల్ కొనసాగుతున్నారు. క్రితం ఎన్నికల్లో



భాజపా అభ్యర్థిగా పాటిల్ ఉండగా.. జగ్‌దీశ్ మెటగుడ తిరుగుబాటు చేయడంతో ఆ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అఫ్జల్‌పుర్‌లో మాజీ మంత్రి మాలికయ్య గుట్టేదర్ బరిలో ఉన్నప్పటికీ ఆయన సోదరుడు నితిన్ గుట్టేదర్ పోటీలో నిలిచారు. చెన్నగిరిలో ఇటీవల అరెస్టైన మదాల్ విరూపాక్షప్ప కుమారుడు మల్లికార్జున్.. నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నిరాకరించాడు. వీటితోపాటు బెంగళూరులోని గాంధీనగర్‌తోపాటు హొసదుర్గలో క్రిష్ణయ్య శెట్టి, గూలిహట్టి శేఖర్‌లు తిరుగుబాటు నేతలుగా పోటీలో ఉండడం పార్టీకి తలనొప్పిగా మారిందనే చెప్పవచ్చు.

**కాంగ్రెస్‌లోనూ తిరుగుబాటు..**

కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం.. పులకేశినగర్, హరపణహళ్లి, శిరహట్టి, శికారిపుర, జాగలుర్, చిత్రదుర్గ, అరకలగూడు నియోజకవర్గాల్లో తిరుగుబాటు నేతలను నామినేషన్లను ఉపహంసరించుకునేలా చేయడంలో పార్టీ అధిష్ఠానం విఫలమైంది. చిత్రదుర్గలో సౌభాగ్య బసవరాజన్, హరపణహళ్లిలో లతా మల్లికార్జున్‌లను పోటీ నుంచి తప్పించలేకపోయింది. శికారిపురలో నాగరాజ్ గౌడ, శిరహట్టిలో రామకృష్ణ దొడ్డమణిలు రెబల్ నేతలుగా పోటీలో నిలబడ్డారు. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో కీలకంగా చక్రం తిప్పే జేడీఎస్‌కూ తిరుగుబాటు నేతల బెడద తప్పలేదు. మాండ్యాలో మాజీ మంత్రి శంకర్ గౌడ మనవడు కేఎస్ విజయానంద్ పోటీలో కొనసాగుతున్నారు.

ఇదిలాఉంటే, నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో పార్టీ తరఫు అభ్యర్థులు ప్రచారంపై దృష్టి పెట్టారు. మే 10న జరిగే ఎన్నికల్లో భాజపా నుంచి మొత్తం 224 స్థానాలకు అభ్యర్థులు బరిలో ఉండగా కాంగ్రెస్ నుంచి 223 (మెల్కొటే స్థానంలో సర్వోదయ కర్ణాటక పార్టీకి మద్దతు), 207 స్థానాల్లో జేడీఎస్, 209 చోట్ల ఆప్, 133 స్థానాల్లో బీఎస్పీ, నాలుగు అసెంబ్లీ స్థానాల్లో సీపీఎం, ఇతరులు పోటీ చేస్తున్నాయి.

# రాష్ట్ర సంక్షేమం కోసం "చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యాగం"

**(విన్యూస్, విజయవాడ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం కోసం మే 12 నుండి ఆరు రోజులపాటు రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యాగాన్ని తలపెట్టడం జరిగిందని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మే 12 నుంచి మే 17వ తేదీవరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ యాగానికి సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లను ఆయన మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన ఈ యజ్ఞాన్ని రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేలా, ప్రజలు సౌభాగ్యంతో జీవించేలా రాష్ట్ర సర్వతోముఖాభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ మహా క్రతువు మే 12వ తేదీ ఉ.5గం.లకు బ్రహ్మ ముహూర్త కాలంలో ప్రారంభమవుతుందన్నారు. ప్రధానంగా నాలుగు యాగ శాలలు ఉంటాయని, ఒక్కో యాగ శాలలో 108 కలశాలతో యాగం జరుగుతుందన్నారు. ఈ యాగ కార్యక్రమాల్లో 520 మందికి పైగా రుత్వికులు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంకాలం 6



గంటల నుంచి 9 గంటల వరకు యాగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతి రోజు అనేక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖ శర్మ మొదలగు ప్రవచన కర్తలు కూడా పాల్గొని ప్రజలకు వివిధ ప్రవచనాలు ద్వారా హిందూ ధార్మిక పరిరక్షణ తదితర అంశాలను తెలియజేస్తారన్నారు. స్వరూపానందస్వామి, చినజీయర్ స్వామి, కుర్తాళ సిద్ధేశ్వర, మంత్రాలయ, జగద్గురు పండితారాధ్య తదితర పీఠాధిపతులు కూడా పాల్గొంటారన్నారు. యాగ శాలల లోపలికి ఎవరికీ అనుమతి ఉండదని, మే 17 తేదీన చివరి అంకంలో భాగంగా పూర్ణహుతి ఉంటుందన్నారు. యాగం నిర్వహణకు దాదాపు రూ.5 కోట్లు వ్యయం అవుతుందన్నారు. ఈ మహా యజ్ఞాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని ఇందుకు వీలుగా 13 కమిటీలు పని చేస్తాయన్నారు. ట్రాఫిక్, ప్రోటోకాల్ వంటి అంశాలకు సంబంధించి జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌ల సూచనలు, సలహాలు అమలు చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజు పట్టాభిషేకం.. ఏర్పాట్ల కోసం రూ.1020కోట్లు..

**లండన్:** బ్రిటన్ రాజు ఛార్లెస్-3 పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రపంచదేశాల అధినేతల మొదలు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వానం వెళ్లింది. మే 6న నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సుమారు 100 మిలియన్ పౌండ్లు (రూ.1020 కోట్లు) ఖర్చుపెడుతున్నట్లు అంచనా. ఈ అధికారిక కార్యక్రమానికి అయ్యే ఖర్చును బ్రిటన్ ప్రభుత్వమే చెల్లించనుంది. సాధారణంగా రాజకుటుంబీకుల వివాహాలను సొంత ఖర్చుతో చేసుకున్నప్పటికీ.. పట్టాభిషేకాన్ని మాత్రం ప్రభుత్వ ఖర్చుతో నిర్వహిస్తున్నారు.

బ్రిటన్ రాణిగా ఎలిజబెత్ II 1953లో పట్టాభిషిక్తురాలయ్యారు. ఆ కార్యక్రమానికి అప్పట్లోనే 1.5 మిలియన్ పౌండ్లు ఖర్చుపెట్టారట. ప్రస్తుత కరెన్సీ విలువతో పోలిస్తే అది సుమారు 50 మిలియన్ పౌండ్లు (సుమారు రూ.528.7 కోట్లు)తో సమానం. తాజా కార్యక్రమం.. క్వీన్ ఎలిజబెత్ పట్టాభిషేక కార్యక్రమానికి అయిన ఖర్చుకు రెట్టింపు అన్నమాట. అయితే, ఈ కార్యక్రమ టీవీ ప్రసార హక్కుల నుంచి వచ్చే ఆదాయం భారీగానే ఉండనున్నట్లు సమాచారం. కార్యక్రమానికి అయ్యే ఖర్చు కంటే ఎక్కువగా వస్తుందని.. అంతేకాకుండా ఇది పర్యాటకానికి ఎంతో ఊతమిస్తుందని బ్రిటన్ మీడియా పేర్కొంది. రాజు పట్టాభిషేక కార్యక్రమానికి



ప్రపంచం నలుమూలల నుంచి అతిథులు హాజరుకానుండటంతో వారికి భద్రత కల్పించడం అతిపెద్ద సవాల్ అని ఈ కార్యక్రమాన్ని నిర్వహించే 'ఆపరేషన్ గోల్డెన్ ఆర్బ్' వెల్లడించింది.

1953 నాటి పట్టాభిషేక కార్యక్రమంతో పోలిస్తే ఊరేగింపు మార్గం తక్కువగా ఉంటుందట. అయినప్పటికీ అది పూర్తికావడానికి 40నిమిషాల సమయం పడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

అప్పట్లో రాణి ఎలిజబెత్ పట్టాభిషేక కార్యక్రమాన్ని సుమారు 3 లక్షల మంది నేరుగా తిలకించారట.

ఈ కార్యక్రమాన్ని బ్రిటన్‌లో 3.7కోట్ల మంది తిలకిస్తారని అంచనా. క్వీన్ ఎలిజబెత్ అంత్యక్రియల సమయంలో వీక్షించిన దానిని బట్టి ఈ మేరకు అంచనా వేశారు.

పట్టాభిషేక కార్యక్రమాన్ని సాధారణంగా వారాంతంలో జరపరు. ఈ సంప్రదాయాన్ని కింగ్ ఛార్లెస్ పక్కకు పెట్టారు. అయితే, ఫుట్‌బాల్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు ఇబ్బంది లేకుండా మే 6ను ఎంపిక చేశారట.

లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ అబేలో జరిగే ఈ కార్యక్రమం కోసం 700ఏళ్ల చారిత్రక నేపథ్యం కలిగిన ఓ కుర్చీని సిద్ధం చేస్తున్నారు.

రాజు ఛార్లెస్-3 భార్య కెమిల్లా మాజీ భర్త ఆండ్రూ పార్కర్ బొవెల్స్ ఈ కార్యక్రమానికి హాజరుకానుండటం విశేషం.

# తిరుమల శ్రీవారి ఆలయం పరిసరాల్లో హెలికాప్టర్ల చక్కర్లు

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయం పరిసరాల్లో మంగళవారం సాయంత్రం 3 హెలికాప్టర్లు చక్కర్లు కొట్టడం భక్తులను ఆందోళనకు గురి చేసింది. శ్రీవారి ఆలయానికి సమీపంలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పరాకమణి భవనం, బాలాజీనగర్ ప్రాంతంలో హెలికాప్టర్‌లు సంచరించినట్టు



అధికారులు గుర్తించారు. తిరుమలలో 3 హెలికాప్టర్లు చక్కర్లు కొట్టడంపై తితిదే విజిలెన్స్ విభాగం అధికారులు ఆరా తీస్తున్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్లు కడప నుంచి చెన్నై వెళ్తుండగా తిరుమల ఉపరితలంలో చక్కర్లు కొట్టినట్టు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

# మద్యం కుంభకోణం కేసులో మనీశ్ సిసోదియాపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ



**ఢిల్లీ:** మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా చుట్టూ సీబీఐ మరింత ఉచ్చు బిగిస్తోంది. ఈ కేసులో సీబీఐ తాజాగా మరో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. అందులో ఆయనను నిందితుడిగా చేర్చింది. ఈ అనుబంధ ఛార్జ్‌షీట్‌లో సిసోదియాతో పాటు తెలుగు రాష్ట్రానికి చెందిన గోరంట్ల బుచ్చిబాబు, మరికొందరిని కూడా నిందితులుగా చేర్చింది.

ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన రెండో ఛార్జ్‌షీట్ ఇది. అంతకుముందు గతేడాది నవంబరులో సీబీఐ తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. అందులో ఏ1గా అప్పటి అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్‌సింగ్‌ను, ఏ2గా అప్పటి అబ్కారీశాఖ అసిస్టెంట్ కమిషనర్ నరేందర్‌సింగ్, ఏ3గా విజయ్ నాయర్, ఏ4గా అభిషేక్ బోయిన్‌పల్లి పేర్లను చేర్చింది. వీరితో పాటు సమీర్ మహేంద్రు, రామచంద్ర పిళ్లై, ముత్తా గౌతమ్‌ను కూడా నిందితులుగా పేర్కొంది.

ప్రభుత్వ మద్యం విధాన రూపకల్పన, అమలులో అవకతవకలు చోటుచేసుకున్న వ్యవహారంపై జరుపుతున్న దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి 26న సిసోదియాను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు ఆయన్ను కస్టడీకి అప్పగించింది. ఇదే వ్యవహారంలో ఈడీ కూడా కేసు నమోదు చేసి సిసోదియాను కస్టడీలోకి తీసుకుంది. కాగా.. ఈ కేసుల్లో సిసోదియా బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. దానిపై ఢిల్లీ కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం (ఏప్రిల్ 26) తీర్పును వెల్లడించనుంది. అయితే తాజా ఛార్జ్‌షీట్‌తో సిసోదియాకు బెయిల్ వచ్చే అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి.

# తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత చిత్రపట వితరణ..

**(వి న్యూస్, కైకలూరు) :** స్థానిక మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాలలకు, తపన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో, భరతమాత చిత్రపటాల వితరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిధిలోని పలు పాఠశాలలకు మంగళవారం నాడు, ఫౌండేషన్ సభ్యులు, ఫౌండేషన్ స్థానిక ప్రతినిధులు, ఆయా పాఠశాలలకు వెళ్లి, విద్యార్థుల సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులకు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాధుని రామోజీరావు, యాసం నరేంద్ర, కందుల వెంకటేశ్వరరావు, స్థానిక తపన ఫౌండేషన్ ప్రతినిధులు బండి దివాకర్, తానంకి నాగసాయి తదితరులు పాల్గొన్నారు.




# స్పందన అర్జీలపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**(వి న్యూస్ గుడివాడ):** మంగళవారం మండల తహసిల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పందన అర్జీలు, గృహ నిర్మాణాలు, తాగునీరు, రీసర్వే తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల దృష్టికి వచ్చిన స్పందన అర్జీలపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలని, అర్జీదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవడానికి వెంటనే రుణాలు మంజూరు అయ్యేవిధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, మెటీరియల్ సరఫరా చేసి ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో తలెత్తే సమస్యలను ఆర్డీవో, హౌసింగ్ పీడీల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా చెరువులను ముందుగానే నింపుకోవాలని, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. అధికారులు వారంలో నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో సందర్శించాలని, దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతిరోజు చేయాల్సిన పనుల చెక్ లిస్టు తయారు చేసుకోవాలని దాని ప్రకారం పనులను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో పి.పద్మావతి, ఎంపీడీవో వెంకటరమణ, డి ఆర్ డి ఏ పీడీ పిఎస్ఆర్.ప్రసాద్, హౌసింగ్ పీడీ జీవీ. సూర్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ రాజు, తహసిల్దారు కే. ఆంజనేయులు, హౌసింగ్ డిఈ రామోజీ నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



# భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవాలి

## - సంగం డైరీ సీడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ

## - విజ్ఞాన్స్‌లో రైతులకు ఘనంగా ప్రారంభమైన ట్రైనింగ్ ప్రోగ్రామ్

**(వి న్యూస్ చేబ్రోలు):** రైతులందరూ పంటలు పండే భూములను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సంగం డైరీ సీడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, నాబార్డ్ ( నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)ల సంయుక్త ఆధ్వర్యంలో "పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ వాల్యూ అడిషన్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్" అనే అంశంపై ఐదు రోజుల పాటు రైతులకు నిర్వహించనున్న ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగం డైరీ సీడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడిని సాధించాలంటే నేలలో సేంద్రీయ కర్బన పదార్థం ఎక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్పుడే పండిన పంటలు రుచికరంగా ఉండటంతో పాటు వాటిని ఎక్కువ రోజులు నిలువ చేయవచ్చన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డ్ డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎం,ఎస్,ఆర్ మూర్తి మాట్లాడుతూ రైతులకోసం ఇక్కడ నిర్వహిస్తున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ విజయవంతమైతే " నాబ్ విజ్ఞాన్ " పేరుతో ఇక్కడే ఒక ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు ఎవరైతే కొత్త విషయాలను కనుగొనడానికి వెతుకుతారో వారే సరికొత్త ఆవిష్కరణలను కనుగొంటారని పేర్కొన్నారు. అవకాశాలనేవి మన వద్దకు రావని, మనమే వాటిని వెతుక్కుంటూ వెళ్లాలని తెలియజేసారు. ఆహార వనరులు ఎక్కువగా దుర్వినియోగం అవుతున్నాయని, ఇలాగే కొనసాగితే దేశంలో 2050 నాటికి ఆహార కొరత ఏర్పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ శరత్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# మంగళవారం ప్రత్యేక ఆరాధన

**(వి న్యూస్ మచిలీపట్నం):** మచిలీపట్నం , పరాసుపేట ఆర్సీఎం చర్చి లో మంగళవారం ప్రత్యేక ఆరాధన. ఫాదర్ లామ్ జయరాజు , ఫాదర్ రవి కుమార్ అద్వర్యం జరిగింది. క్రైస్తవ భక్తులు , ఏ ఐ సి సి సభ్యులు మువ్వల యోహాన్ , తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**(వి న్యూస్ మచిలీపట్నం రూరల్):** సహాయ ఫౌండేషన్ , లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ఈదుముడి గ్రామంలో దుర్గ భవాని అనే ఒంటరి మహిళ తన ఇద్దరు చిన్నారులతో పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. వారం రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో వారు ఉంటున్న ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు, ప్రస్తుతం స్థానిక స్కూల్ లో నివాసం ఉంటున్నారు అని తెలిపారు. ఈదుముడి గ్రామంలో ఉంటున్న సహాయ ఫౌండేషన్ సభ్యురాలు భానుశ్రీ ద్వారా సహాయం కోరగా మంగళవారం పేద కుటుంబానికి వంట సామాగ్రి,నిత్యావసరాలు,25 కే జి ల బియ్యం,6 జతల బట్టలు,దుప్పట్లు,కూరగాయలతో పాటు రూ. 2500 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ అధ్యక్షులు ఎం డి. ఉస్మాన్ బాషా, సహాయ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ, మట్టా రాధ కృష్ణ మూర్తి, రౌతుల ప్రసాద్, అమీన్ మాస్టర్, బట్ట దుర్గ శంకర్, కళ్యాణి, భానుశ్రీ,తదితరులు పాల్గొన్నారు.



# రహదారి ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి గ్రూప్ ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ

**(వి న్యూస్ మచిలీపట్నం):** 18 అక్టోబర్ 2022 న రహదారి ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్-1081 మేడేపల్లి దేవ కుటుంబరావు కుటుంబానికి గ్రూప్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ద్వారా రాబడిన 20,65,000/- రూపాయల చెక్కును ఆయన సతీమణి మేరీ కెంపులత కి జిల్లా ఎస్పీ .జాషువా జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు అని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో, వివిధ ప్రమాదకర పరిస్థితుల్లో ఎంతో మంది సిబ్బందిని కోల్పోతున్నామని, వారి మరణం పోలీస్ శాఖకు తీరని లోటు అయినప్పటికీ వారి కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని తెలియజేస్తూ, కుటుంబరావు రహదారి ప్రమాదంలో మన వద్ద నుండి దూరమైన, అయిన సేవలు ఎల్లవేళలా మన మదిలో నిలిచిపోతాయని తెలియజేస్తూ, కుటుంబరావు కుటుంబానికి చెక్కు అందజేసిన ఏ చిన్న సమస్య ఉన్న నేరుగా సంప్రదించవచ్చు ని మీకు తోడుగా మేమున్నామని భరోసా ఇచ్చారు.



# 5 శాతం రాయితీకి ఇక 5 రోజులు మాత్రమే ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని

## విజ్ఞప్తి : కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**(విన్యూస్, విజయవాడ):** రోజులే సమయం వుందని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.

ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడం వలన నగరా భివృద్ధికి దోహదపడుతుందని, పాత బకాయిలు వున్న పన్నులపై వడ్డీని మాఫీ చేసిన ప్రభుత్వం నేడు ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ నెలఖారు లోపు ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లింపులపై 5 శాతం రాయితీని ప్రకటించందని, ఈ అవకాశాన్ని విజయవాడ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ మూడు సర్కిల్స్ కార్యాలయాలలో నగదు కౌంటర్లు పనిచేస్తాయన్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు, డీఅండ్ వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్.
9246761404
08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.
సంప్రదించండి:
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్
గొడుగుపేట-మచిలీపట్నం
సెల్:9182197822
9121605277

**అద్దెకు ఇవ్వబడును**
జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥గు వారు సంప్రదించండి. లిఫ్టు సౌకర్యం కలదు.
సంప్రదించండి:
7997883575
9347576464
9515237110

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
------------
సంప్రదించండి
9848667347




మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే
బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822

**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును.
సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి :
96407 54054-91828 17435

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి:
సెల్: 7032931205
సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**వంట మనిషి కావలెను**
మచిలీపట్నం జల్దువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్)
సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల)
సెల్:7032931205

**స్థలం అమ్మబడును.**
డోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి:
సంప్రదించండి:
7997883575
9347576464

# సర్వే ఫలాలు ప్రజలకు చేర్చటంలో జెసిలదే కీలక భూమిక

## - ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం
## - నూతన జాయింట్ కలెక్టర్‌ల కోసం ఒక రోజు సర్వే పునశ్చరణ సదస్సు
## - విభిన్న అంశాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగించేలా తరగతులు




**(వి న్యూస్ అమరావతి):** భూసర్వే ఫలాలు ప్రజలకు చేర్చటంలో జిల్లా సంయిక్త పాలనాధికారులు ముఖ్యమైన భూమికను పోషించవలసి ఉందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇటీవల జిల్లా సంయిక్త పాలనాధికారులుగా (జాయింట్ కలెక్టర్) బాధ్యతలు స్వీకరించిన ఐఎఎస్ అధికారుల కోసం తాడేపల్లి లోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం వేదికగా నిర్వహించిన భూసర్వే పునశ్చరణ సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజేయ కల్లం మాట్లాడుతూ అధికారులు ప్రజాసేవ తో ప్రజల మనస్సులలో సుస్థిర స్థానం సంపాదించుకోగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి మానస పుత్రిక గా ప్రారంభమైన వైఎస్ ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతర సమన్వయం, ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమన్నారు. ప్రణాళికా బద్దంగా భూముల రీసర్వే ను చేపట్టటం ద్వారా ఆ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని భూపరిపాలన చీఫ్ కమీషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ అన్నారు. జిల్లా సంయిక్త పాలనాధికారుల సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఆయన దోషాలకు తావులేని రీతిలో ఎవ్వరూ వేలెత్తి చూపని రీతిలో భూసర్వే పూర్తి చేయాలన్నారు. భూపరిపాలన, సర్వే సెటిల్ మెంట్ కమీషనర్ సిద్దార్థ జైన్ మాట్లాడుతూ భూసర్వే ఫలితంగా అత్యధిక సంఖ్యలో గ్రామ సర్వేయర్లను నియామకాలు చేసి, వారికి 82 రకాల రీసర్వే శిక్షణలు ఇవ్వడం ద్వారా శాఖను మరింత పటిష్టపరచుకోగలిగామన్నారు. ఈ మానవవనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదునాతన సాంకేతిక సర్వే పరిజ్ఞానం వినియోగంలో సైతం ఆంధ్రప్రదేశ్ దేశం లోనే ముందంజలో ఉందని, సర్వేయర్లకు డ్రోన్ పైలట్లగ శిక్షణ ఇచ్చి వారిని డ్రోన్ ఫైలెట్లు వినియోగించుకుంటున్నారని అన్నారు. ఒక రోజు పునశ్చరణ సదస్సులో సర్వే, సరిహద్దు చట్టంపై సిద్ధార్థ జైన్ అవగాహన కల్పించగా, ఆర్ఓఆర్ చట్టం, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల పై అదనపు సిసిఎల్ఎ ఎండి ఇంతియాజ్ సంయిక్త కలెక్టర్లకు వివరించారు. పంచాయతీ రాజ్ కమీషనర్ శ్రీమతి సూర్యకుమారి , సర్వే శాఖ అదనపు సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ స్వమిత్వ కార్యక్రమం గురించి దిశా నిర్దేశం చేసారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు కార్స్, రోవర్స్ అంశాలను విపులీకరించగా, సర్వే ఐటి కార్యక్రమాల గురించి రచన తెలిపారు. సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ఎన్ వివిఎస్ కుమార్ , కాకినాడ ఆర్ డిడి కెజియా కుమారి , కేంద్ర కార్యాలయం డిడి ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు కొడాలి వినోద్ ఆర్థిక సాయం ..



**(వి న్యూస్ ముదినేపల్లి) :** స్థానిక మండల పరిధిలోని కొరకుంటపాలెం గ్రామపంచాయతీ శివారు రాజనగరం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన పలువురికి మంగళవారం నాడు స్థానిక తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, కొడాలి వినోద్ తన వంతు సహాయంగా 15 వేల రూపాయలను వారి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొంగు రవికుమార్, పంతగాని సురేష్, దావు నాగరాజు, బత్తుల రవి, బూరుబోయిన లక్ష్మీనరసింహస్వామి, దాసరి శ్రీను, ముచ్చు నాగేశ్వరరావు, తుమ్మ వీరాంజనేయులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి వసతులతో టిడ్కో గృహాలు

## - 8,912 గృహాలను త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తాం.. : జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు



**(వి న్యూస్ గుడివాడ):** గుడివాడలోని టిడ్కో గృహాలు అన్ని వసతులతో నిర్మాణాలను పూర్తి చేసుకున్నాయని, త్వరలో వాటిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు.

మంగళవారం ఆయన గుడివాడ మండలం బొమ్ములూరు సమీపంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న టిడ్కో గృహాలు, మల్లయపాలెం జగనన్న ఇళ్ల నిర్మాణాలను సందర్శించి పురోగతిని పరిశీలించారు. పురోగతి పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుడివాడలో 80 ఎకరాలలో 8,912 టిడ్కో గృహాలను మొదటి, రెండు దశలలో నిర్మాణాలను చేపట్టి అన్ని మౌలిక వసతులను కల్పించి నిర్మాణాలను పూర్తి చేయటం జరిగిందన్నారు. లెవలింగ్, ఆర్చ్ నిర్మాణం వంటి చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయని, అవి కూడా పూర్తి కాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదగా లబ్ధిదారులకు అందించనున్నామని చెప్పారు. గృహాల ప్రారంభోత్సవ సమయానికి మిగిలిన అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీపంలోని రైలు బ్రిడ్జి కింద నుంచి మున్సిపాలిటీ పైపులైను నిర్మాణం, మురుగునీటి శుద్ధి కర్మాగారం ఏర్పాటు పనులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ కు అధికారులు తెలిపారు. ఒకపక్క టిడ్కో గృహాలు మరో ప్రక్క జగనన్న ఇళ్లతో ఇది జిల్లాకు మోడల్ ప్రాజెక్ట్ గా నిలువనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

177 ఎకరాలలోని మల్లయ్య పాలెం జగనన్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలిస్తూ, లేఅవుట్లో మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులు గృహాలను త్వరితగతిన నిర్మించుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. మంజూరైన 4వేల గృహాలకు గాను 2,100 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు ఆయనకు అధికారులు తెలిపారు. రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ గుడివాడ మండలం, బొమ్ములూరు గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న పొలాలలో సర్వే సిబ్బంది చేపడుతున్న రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ పి. రాజాబాబు మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. బొమ్ములూరు గ్రామంలో 719 సరిహద్దు రాళ్ళను పాతాల్సి ఉండగా ఐదు వందలు పూర్తి చేశామని, మండలం మొత్తం మీద 16 వేలకు గాను 6,050 సరిహద్దు రాళ్ళను పాతినట్లు కలెక్టర్ కు అధికారులు తెలిపారు. పక్క గ్రామాల నుంచి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని రోజుకు వెయ్యి చొప్పున వారం రోజుల్లో మిగిలిన స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, డి ఆర్ డి ఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ రాజు, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.చిన్నోడు, సర్వే ఏడి గోపాల్ రాజ్, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దారు కే. ఆంజనేయులు, హౌసింగ్ డీఈ రామోజీ నాయక్, విద్యుత్ శాఖ, గ్రామ మండల సర్వే అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**(వి న్యూస్ మచిలీపట్నం):** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.జి.గీతాబాయి , జిల్లా మలేరియా అధికారి బి. రామారావు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి ర్యాలీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్బంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి అయిన డాక్టర్. జి.గీత బాయి మాట్లాడుతూ మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పించి తద్వారా మలేరియా వ్యాధి నిర్మూలన చేయుటకు గాను ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25 వ తేదీన ఈ దినోత్సవం జరుగుతుందని తెలిపారు. నీటి నిల్వల లో దోమలు వృద్ధిచెందు కావున ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవలసినదిగా తెలిపారు. దోమ కాటు నుంచి నివారణకు గాను దోమ తెరలు చేయవలసినదిగా సూచించారు. జ్వర సంబంధిత వ్యాధులకు ప్రతి ఆరోగ్య కేంద్రాలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారు అని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి బి. రామారావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమాల ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ డాక్టర్. శర్మిష్ఠ , ఏ.ఓ. సాంబి రెడ్డి , హెచ్.ఇ. రాజేంద్ర కుమార్, యం.పి. హెచ్.ఇ.ఓ. సుకుమార్, మురళి, మోహన్ రావు, యం.పి. హెచ్.ఎస్. రాఘవేంద్రరావు, సుహాసిని, ఎ.న్.మ్, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

# సమయం లేదు... సమరానికి దిగాల్సిందే

## - బీసీలంతా ఏకమై పోరాడితేనే బ్రతుకులు బాగుపడతాయి
## - బీసీలను దగా చేసిన జగన్ కి బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుదాం
## - సగర, ముదిరాజ్, సూర్య బలిజ సాధికార సమితుల శిక్షణ కార్యక్రమంలో కొల్లు రవీంద్ర



**(వి న్యూస్, విజయవాడ):** బీసీలంతా ఏకమై పోరాడితే సాధించలేనిది ఏదీ లేదు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో బీసీలందరినీ అణచివేయడమే లక్ష్యంగా అడుగులు వేశారు. సంక్షేమ పథకాలు రద్దు చేసి దగా చేశారు. తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సగర/ఉప్పర, ముదిరాజ్, సూర్య బలిజ సాధికార కమిటీ సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా జగన్ రెడ్డి పాలనలో బీసీలు అత్యంత దుర్బరమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. 56 కార్పొరేషన్ల పేరుతో హడావుడి చేసి, ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించినట్లు చెబుతున్న జగన్ రెడ్డి ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎంత ఖర్చు చేశారన్న ప్రశ్నకు ఎందుకు సమాధానం చెప్పడం లేదు అని ప్రశ్నించారు. బీసీలకు చెందిన 28 పథకాలు రద్దు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా పథకాలు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో బీసీల కోసం నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించిన బీసీ భవన్స్, కమ్యూనిటీ హాల్స్, దోబీ ఘాట్స్, సొసైటీ బిల్డింగ్స్‌ను నాలుగేళ్లుగా పూర్తి చేయకుండా పాడుబెట్టారు. విదేశీ విద్య, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, స్టడీ సర్కిల్స్, పెళ్లి కానుకలు, ఆదరణ వంటి పథకాలన్నీ రద్దు చేసి దగా చేశారన్నారు. బీసీలను ఇంకా ఓటర్లుగానే చూస్తూ, వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తున్న జగన్ రెడ్డిని సాగనంపే వరకు తెలుగుదేశం పార్టీ, బీసీ విభాగం అలుపెరుగక శ్రమిస్తుందన్నారు. ఎన్నికలకు ఎంతో సమయం లేదు.. ఇప్పటి నుండే కమిటీలన్నింటినీ పూర్తి చేసుకుని ప్రజల్లోకి వెళ్లి డోర్ టూ డోర్ ప్రచారం చేయాలని, జగన్ రెడ్డి అరాచకాలను గడపగడపకూ వివరించారన్నారు. కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ నాలెడ్జి సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ జగన్ రెడ్డి.. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు రద్దు చేసి బీసీలు రాజకీయంగా ఎదగకుండా చేశారన్నారు. ప్రస్తుత కాలంలో ఆస్తులు కలిగిన వారికి ఉండే గౌరవం వేరు. ఆ ఉద్దేశ్యంతో చంద్రబాబు భూమి కొనుగోలు పథకం ప్రవేశపెట్టి పేదలకు భూములు పంచితే, జగన్ రెడ్డి బీసీల నుండి 8వేల ఎకరాల భూముల్ని లాక్కున్నారు. చదువుకుంటే ఎంతటి పేదరికంలో పెరిగినా భవిష్యత్ బాగుంటుందనే లక్ష్యంతో చంద్రబాబు విదేశీ విద్య, స్కిల్ డెవలప్ మెంట్, స్టడీసర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పెడితే జగన్ రెడ్డి వాటిని రద్దు చేసి బీసీల పిల్లలు ఇక్కడే చదువుకోవాలి, ఉన్నత చదువులు ఎందుకు అనే పరిస్థితి కల్పించారు. పైగా నవరత్నాల పేరుతో నకిలీ రత్నాలను ప్రజల నెత్తిన రుద్దుతున్నారు. రూపాయి చేతిలో పెట్టి వంద రూపాయలు లాక్కుంటున్నారని. ఇలాంటి దుర్మార్గపు ముఖ్యమంత్రి ఎప్పుడూ చూడలేదని, భవిష్యత్తులోనూ ప్రజలు చూడరన్నారు. బీసీలంతా ఏకమై, జగన్ రెడ్డి పై తిరుగుబాటు చేసి బీసీల హక్కుల్ని, అస్థిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ కారణంగా ఓటర్లుగా ఉన్న బీసీలు ప్రస్తుతం రాజ్యాధికారంలో భాగస్వాములయ్యారు. ఎన్టీఆర్ 20శాతంతో రిజర్వేషన్లు మొదలు పెడితే చంద్రబాబు 34శాతం వరకు పెంచారు. జగన్ రెడ్డి బీసీలను ఉద్దరిస్తా, అండగా నిలుస్తానని చెప్పి.. రిజర్వేషన్లు కుదించి దగా చేశారు. పథకాలు రద్దు చేసి, అభివృద్ధి నాశనం చేసి ఇంకా బీసీలను ఉద్దరిస్తారు చెప్పుకోవడం హాస్యాస్పదం. తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తేనే, బీసీలకు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా మేలు జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంజాం రాఘవేంద్ర మాట్లాడుతూ.. ఎన్నికల యుద్ధంలో గెలవాలంటే ప్రచార యుద్ధం లో గెలవాలి. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ప్రతి ఒక్కరి మీదా ఉంది. ఒంటిపై చొక్కా లేకుండా అయినా ఉన్నారేమో గానీ, చేతిలో ఫోన్, సోషల్ మీడియాలో అకౌంట్ లేనివారు ఎక్కడున్నారు.? అందుకే తెలుగుదేశం పార్టీ బీసీ విభాగంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని, తాము చేసే కార్యక్రమాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పాటుగా, జగన్ రెడ్డి అరాచకాలపైనా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయాలి. జగన్ రెడ్డి బీసీలకు చేస్తున్న దగా, మోసాన్ని ప్రజలకు తెలియజేయడం లో 40 శాతం జనాభా కలిగిన మనం మన బాధ్యతను గుర్తెరిగి పోరాటం చేయాలని, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేశ్ ఇచ్చిన సెల్ఫీ ఛాలెంజ్‌ను బీసీ విభాగం తరపున కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ సభ్యులుగా చేరిన వారితో శ్రీ కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సగర సాధికార కమిటీ కన్వీనర్ జంపన శ్రీనివాస్, ముదిరాజ్ సాధికార కమిటీ కన్వీనర్ పి.ఎల్ రావు, సూర్య బలిజ సాధికార కమిటీ కన్వీనర్ రాళ్ల కొట్టు రాము, విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కోఆర్డినేటర్ సింహాద్రి కనకాచారి సగర ముదిరాజు సూర్య బలిజ సాధికార కమిటీల కోఆర్డినేటర్ కడలి గోపాలరావు సహా తెలుగుదేశం పార్టీ సాధికార కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దస్తావేజులు పోయినవి

అల్లు నరసింహారావు S/O అల్లు సుబ్బయ్య డో.నెం:30/265,మల్కాపట్నం, మచిలీపట్నం.నాకు గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో ద.నెం:2175/2009, సర్వేనెం : 847/2,847/3,847/4లకు సంబంధించి మొత్తం 5.16ఎకరాల భూమి ఉంది. సదరు భూమికి హద్దులు ఇలా ఉన్నాయి.

**తూర్పు : పుప్పాల వెంకటేశ్వరరావు వగైరాల భూమి**
**దక్షిణం : మురుగుబోదె**
**పడమర : మురుగుకాలువ**
**ఉత్తరం : తలారి వెంకటేశ్వరరావు వగైరాల భూమి**

**ఈ హద్దుల మధ్య గల భూమికి సంబంధించిన దస్తావేజులను జెరాక్స్ తీయించే నిమిత్తం పరాసుపేట సెంటర్ నుంచి లక్ష్మీ టాకీసు వైపు వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతకినను దొరకలేదు. దొరికిన వారు ఈ కింది చిరునామాకు సంప్రదించగలరు.**

**సంప్రదించండి : అల్లు నరసింహారావు S/O సుబ్బయ్య, డోనెం:30/265,మల్కాపట్నం, మచిలీపట్నం. కృష్ణాజిల్లా. సెల్: 8143143521**

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279